క్లుప్తంగా

టాంగో షూడో పోటీలలో పలువురికి పతకాలు



తెనాలిఅర్బన్: నేషనల్ టాంగో షూడో చాంపియన్ షిప్‌లో తెనాలిలోని కేఎస్ఆర్ తైక్వాండో అకాడమి విద్యార్థులు పలువురు పతకాలు సాధించారని కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను ఢిల్లీలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించినట్లు చెప్పారు. డి.సాయి హర్షిత అండర్ 47 కేజీల విభాగంలో, తుల్లిమల్లి సాయి జశ్వంత్ అండర్ 41 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. బెల్ట్ గ్రేడింగ్‌లో డి.సాయి హర్షిత బ్లాక్ బెల్ట్‌ను సాధించినట్లు వివరించారు. వీరిని డీఎస్పీ డాక్టర్ స్రవంతి రాయ్ తెనాలిలో బుధవారం అభినందించి, సర్టిఫికెట్స్ అందజేశారు.

ముగిసిన శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలోని రామ నామక్షేత్రంలో ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలు బుధవారం మహా నివేదనతో ముగిశాయి. ఉదయం స్వామి వార్లకు పంచవింపు సేవను స్త్రీలు సమష్టిగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కూరపాటి సుధాకర శాస్త్రి, అద్దేపల్లి శ్రీరామాచార్యులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను సంఘ అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు, ఉపాధ్యక్షులు కాగిత దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు పర్యవేక్షించారు.

రేపు ముగ్గుల పోటీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు వాసవీ క్లబ్, సంతూర్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 13వ తేదీన ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ నిర్వాహకులు నాగళ్ల ఆంజనేయులు నంబూరు లక్ష్మీపవన్ కుమార్, నంబూరు బాలాజీ నాగ వరప్రసాద్‌లు బుధవారం తెలిపారు. అదే విధంగా అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. వివరాలకు 91544 92701 నంబరులో సంప్రదించాలని కోరారు.

మొక్కజొన్నలో తెగుళ్ల గుర్తింపు

పల్లెకోన(భట్టిప్రోలు): మొక్కజొన్న పంట పొలాల్లో అక్కడక్కడ ఆకులు తెల్లబడి పెరుగుదల నిలిచిపోవడం గమనించినట్లు మండల వ్యవసాయశాఖాధికారి గొల్లపోతు మీరయ్య తెలిపారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో బుధవారం ఆయన ఆర్బీకే సిబ్బందితో కలసి మొక్కజొన్న పంట పొలాలను సందర్శించారు.దీని నివారణకు ఎకరాకు 19-19-19ని అరకిలో మాంకోజబ్ లేదా కార్బండైజం 250-300లు గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. పంట ఉరక పరిస్థితుల్లో ఉంటే ఎకరాకు 25 కిలోల యూరియాను వెదజల్లాలని సూచించారు. పల్లెకోన సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ-ప్రతాప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మండవ రామకోటేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐలవరంలో కూడారై ఉత్సవం

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో కొలువైన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాసం పురస్కరించుకుని 27వ రోజు కూడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు దీవి రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ 27 నక్షత్రాలకు సంకేతమైన పర్వదినమని తెలిపారు. గ్రామ ప్రజలు స్వామి వార్లకు హారతులు పట్టి దివ్య నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ పడమట వెంకటేశ్వరరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కేవీవీ రమణ, ఫణిదపు నాగులు, జి.జగన్‌మోహన్‌రావు, వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నగరం: స్నేహపూర్వక వాతావరణానికి క్రీడలు దోహదపడతాయని గ్రామ సర్పంచి చింతల పవన్‌కుమార్ చెప్పారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం సర్పంచి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17వతేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన జట్లుకు రూ.20 వేలు,15 వేలు,10 వేలు ప్రోత్సాహక నగదుతో పాటు షీల్డ్‌లను బహూకరించనున్నట్లు పేర్కొన్నారు.

జవాబుదారీతనం పెంచిన సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: సాధారణంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు విస్మరిస్తుండటం గతంలో పరిపాటిగా మారుతుండేది. కానీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి దానికి పూర్తి భిన్నంగా ఇచ్చిన ప్రతి హామీని అధికారం చేపట్టిన నాటి నుంచి నేరవేర్చుతూ జవాబుదారితనాన్ని మరింత పెంచారని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 36వ వార్డు గంగానమ్మపేటలోని డాక్టర్ మస్తానమ్మ హస్పిటల్ నుంచి బుధవారం ఉదయం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ 36వ వార్డు ఇన్‌చార్జి తొలిచూరి నాగమల్లేశ్వరరావు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉండటంతో పాటు వారికి ఆర్థిక భరోసాను కల్పించినట్లు చెప్పారు. సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో వేయటం వల్ల ఎటువంటి అవినీతికి తావులేకుండా పోయిందన్నారు. అందువల్లే ప్రజలు తమ ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. 36వ వార్డులో 920 ఇళ్లు ఉన్నాయని, 2600 మంది జనాభా ఉన్నారన్నారు.

ఇది వ్యాపార కూడలి కావటం వల్ల ఇది చిన్న వార్డుగా అభివర్ణించారు. వార్డులో ఇప్పటి వరకు రూ.9.96 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు వివరించారు. అంతే కాకుండా వార్డులో నివశించే 313 మంది పేదలకు నివాస స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వీర్లపాటి విజయలక్ష్మి, తాడిబోయిన రామయ్య, షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, గడవర్తి సాయి హరేరామ్, కో-అప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, 36వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బట్ట అంజిబాబు, ఆర్ల శ్రీనివాసరావు, బట్ట శ్రీమన్నారాయణ, భీరం లోకేశ్వరరావు, భరణి శ్రీనివాసరావు, భీరం శ్రీనివాసరావు, తాడిబోయిన నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, ఎస్ఆర్‌కె శర్మ, బూరెల దుర్గ, అక్కిదాసు కిరణ్ కుమార్, ఏలూరి శేషగిరిరావు, కాళిదాసు సత్యం, కఠారి హరీష్, కావేటి ఈశ్వరరావు, రెడ్డి రమణమ్మ, రావి ప్రశాంతి, కోలా వాసు, సిరికృష్ణ, అడుసుమల్లి శ్రీనివాసరావు, మల్లిబోయిన రాము, సతీష్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, కాకి దేవసహాయం, హరిదాసు గౌరిశంకర్, కాళిదాసు వెంకటేశ్వర రావు, సయ్యద్ దౌలత్ పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస మహోత్సవం



పూజల్లో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో ధనుర్మాస వ్రత మహోత్సవం వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని ఊదా రంగనాధుల స్వామివారికి పూజలు జరిపారు. బాలస్వామిజీ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో సాలిగ్రామ మఠం ట్రస్టు చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి, ఎం.రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, జి.రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు. బోసురోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా కుడారాయి, గంగానోత్సవంలో భాగంగా సామూహికంగా దంపతులు పొంగలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని పూజలు జరిపారు. లోక కళ్యాణార్థం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని దంపతులు పూజలు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు ఎన్.వేణు, కార్యదర్శి బి.నరసింహారావు, ఉప్పల వరదరాజులు, ఎం.హరిప్రసాద్, టి. సాయి, మద్దాళి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

కొలకలూరులో బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ రత్నాకర్

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులోని రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో పొన్నెకంటి బెంజిమన్ స్మారక నాలుగు జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. కొత్తా ఐజాక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ రత్నాకర్, రెండు తెలుగు రాష్ట్రాల బీసీ నాయకుడు ప్రసాద్ యాదవ్‌లు ప్రారంభించారు. మెన్ డబుల్స్ 25 టీంలు, మెన్ సింగిల్స్ 15 టీమ్‌లు, వెటరన్‌డబుల్స్ ఎనిమిది, అండర్15 బోయ్స్ ఎనిమిది టీమ్‌లు, మెన్ డబుల్స్ ఎనిమిది టీంలు పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలు ఈనెల 14వ తేదీ వరకు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రబాబు, వినయ్ కుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో పి.విజయ కుమారి, విజయవర్ధన్, చక్రవర్తి, థామస్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో నూరుశాతం లక్ష్యం కావాలి

డీఈఓ పీవీజే రామారావు



బాపట్ల డివిజన్ ఎంఈఓలు హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

చెరుకుపల్లి: ప్రతి పాఠశాలలో పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని సబ్జెక్టుల వారీగా మెరుగుపరచి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా హెచ్‌ఎంలు కృషి చెయ్యాలని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు సూచించారు. మండలంలోని గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాపట్ల డివిజన్‌లోని ఎంఈఓలు, హెచ్‌ఎంలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విషయ నిపుణులతో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన విషయాల్లో పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చెయ్యటం కోసం తగిన ప్రణాళిక రూపకల్పన చేశామన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాల పరిధిలో బడిఈడు పిల్లలను గుర్తించి ఉపాధ్యాయులు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మరి ముఖ్యంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక పంపిణీకి రాబోవు విద్యా సంవత్సరానికి సన్నద్ధం కావాలన్నారు. అనంతరం నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో జరుగుతున్న పనులపై ఆయా పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓలు టి.నవీన్ కుమార్, పులి లాజర్, కె.సురేష్, కె.లక్ష్మీనారాయణ, సీహెచ్ రవికాంత్, యు.వెంకటేశ్వరరావు, కె.హరిబాబుతో పాటు పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలిఅర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 7గంటలకు 36వ వార్డు గంగానమ్మపేటలోని గంగానమ్మగుడి నుంచి ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

వాహనచోదకులకు జరిమానా

తెనాలిరూరల్: నిబంధనలు పాటించని వాహన చోదకులకు పోలీసులు జరిమానా విధించారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. త్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, నిబంధనలకు మించి ఎక్కువ మంది ప్రయాణికులతో వెళుతున్న ఆటోలను, ఓవర్ స్పీడుతో వెళుతున్న వాహనాలను గుర్తించారు. 10 మంది వాహదారులకు రూ. 7500 జరిమానా విధించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చెరుకుపల్లి: గూడవల్లి మునిస్వామి నాయుడు స్మారక ఉన్నత పాఠశాలలో 1978-79 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం మెదటి రోజు ఘనంగా న్విహించారు. ఆ నాడు కలసి చదువుకున్న వారు వివిధ ప్రాంతాల్లో, దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న, మరియు స్వగ్రామాల్లో వివిధ రకాల వృత్తులు, వ్యవసాయం చేసుకుంటున్న 102మంది పూర్వ విద్యార్థులు 40 సంవత్సరాల తరువాత కలుసుకుని గత స్మృతులు నెమరువేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం రెండో రోజు పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్లపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. యాజలి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, ఆర్యవైశ్య నాయకుడు నందిపాటి సుబ్బారావు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడని కర్లపాలెం ఏఎస్ఐ సాంబశివరావు బుధవారం తెలిపారు. ఈనెల 3వ తేదీన సుబ్బారావు యాజలి సెంటర్ నుంచి కర్లపాలెం వైపు మోపెడ్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనటంతో తీవ్రంగా గాయపడి గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారని సాంబశివరావు తెలిపారు.

సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఆదాయం



మండల పరిషత్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీపీఓ శంకర్‌నాయక్

కర్లపాలెం: గ్రామ పంచాయతీలలో సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని ఇన్‌చార్జి డీపీఓ, ద్వామా పీడీ వై.శంకర్‌నాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, ఉపాధి సిబ్బందికి జరిగిన అవగాహన సదస్సుకు ఇన్‌చార్జి డీపీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న సంపద సృష్టి కేంద్రాలను ఆధునికీకరించాలని చెప్పారు. ఇంకా నిర్మాణం పూర్తికాని కేంద్రాల పనులను వెంటనే పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామాలలో ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని చెప్పారు. ఎంపీడీఓ ఎ.ఎలీషాబాబు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలు పంపిణీ



అమర్తలూరులో వినికిడి యంత్రాలు పంపిణీ చేసిన డాక్టరు శేషగిరిరావు

అమర్తలూరు(వేమూరు): వినికిడి లోపం ఉన్నవారికి యంత్రాలు అందజేయడం జరుగుతుందని డాక్టరు వేమూరి శేషగిరిరావు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలో ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. పేద కుటుంబ సభ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా బుధవారం సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన చెప్పారు. మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, ఈదర వెంకట పూర్ణ చంద్రరావు జొన్నాదుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

డీపీఎం వాణిశ్రీ

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని డీపీఎం వాణిశ్రీ తెలిపారు. మండలంలోని ఖాజీపాలెంలో డాక్టర్ వైఎస్సార్ క్లస్టర్ పొలంబడిలో భాగంగా మూడు రోజుల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 నుంచి 25 రోజుల మధ్య కాలంలో మినుము పంటపై ఆకుతినే పురుగు ఉన్నందున దీని నివారణకు సుస్థిర సేంద్రియ పద్ధతిలో బ్రహ్మాస్త్రను తయారు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మినుము పంట ఆరోగ్యకరంగా పెరిగేందుకు ద్రవజీవామృతం వాడే విధానాన్ని రైతులకు సూచించారు. ఏఈఓ సుదర్శనరావు, వీఏఏలు, ఐసీఆర్‌పీలు ఉన్నారు.

పిండిమర యూనిట్ కింద రూ. 2 లక్షల చెక్కు

భట్టిప్రోలు: బాపట్ల స్పందన హాలులో బుధవారం జరిగిన బడుగు వికాసం, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ గ్రౌడింగ్ మేళాలో బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు మండలం ఆళ్లమూడికి చెందిన మహిళ పొట్లూరి రాజ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్‌తో ఇంట్రాక్ట్ అయ్యారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద పిండిమర యూనిట్‌కు సంబంధించి రూ.2 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, శాసనమండలి సభ్యుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకున్నట్లు మండల సమాఖ్య ప్రాజెక్ట్ మేనేజర్ కొండూరు శోభన్ తెలిపారు.

16న నరసింహ స్వామి తెప్పోత్సవం

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ వాలివెంకట శివారెడ్డి మాట్లాడుతూ స్వామివారి దేవాలయంలో డిసెంబర్ 15 నుంచి ధనుర్మాస ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 16వ తేదీన స్వామివారి తెప్పోత్సవాన్ని నిజాంపట్నం-తెనాలి పంటకాలువలో అల్లూరు రెడ్లపాలెం నుంచి నిజాంపట్నం లాకుల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాంకేతికతతో ఉన్నత శిఖరాలకు చేరుకోండి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- వాడవాడలా సంక్రాంతి సంబరాలు



నెహ్రూనికేతన్ స్కూల్‌లో చిన్నారులతో ఎమ్మెల్యే శివకుమార్



సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తెనాలిఅర్బన్: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి విస్తరిస్తున్న నేటి రోజులలో కూడా తెలుగు సాంప్రదాయాలను అద్దంపట్టే పండుగులను పాఠశాలల్లో నిర్వహించటం ముదావహమన్నారు. ప్రతి ఒక్కరూ పండుగల విశిష్టతలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో పాఠశాలకు వచ్చి అందరినీ అలరించారు. ముగ్గుల పోటీలు, హరిదాసు సందడులు, బొమ్మల కొలువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి గీతాకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.గీతాకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

- బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం హైస్కూల్‌లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ పాల్గొన్నారు. ముగ్గుల పోటీలను పరిశీలించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. భోగి మంటలు, పొంగళ్లు వంటి కార్యక్రమాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి రాము, హెచ్‌ఎం నాజ్‌నీన్ జిగర్ పాల్గొన్నారు.
- మారీసుపేటలోని స్కూల్ ఆఫ్ రాయల్స్‌లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు హరిదాసుల వేషాలలో పాఠశాలకు వచ్చి అందరిని అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.పద్మావతి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూరల్ పరిధిలో.,....

తెనాలిరూరల్: పట్టణ బోస్‌రోడ్డులోని శ్రీదేవి హైస్కూలులో బుధవారం సంక్రాంతి సంబరాలు సందడిగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలు, పండుగ విశిష్టతను పిల్లలకు తెలియజేస్తూ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు, చెరుకుగడలు, భోగి పళ్లు, పొంగళ్లతో సంక్రాంతి సంబరాలు ఎంతో అట్టహాసంగా కోలాహలంగా జరిగాయి. విద్యార్థులు సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో సంబరాల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు పి. లతాదవి పర్యవేక్షించారు.

రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలి

జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు



కంచర్ల పాలెం ఆర్బీకేలో సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తెనాలి టౌన్: రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న, పెసర తదితర పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కంచర్లపాలెం, తేలప్రోలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు పంట నష్టపరిహారం లభిస్తుందన్నారు. రైతులందరూ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఆర్బీకేల్లో మినుము విక్రయిస్తున్నామని, జొన్న, మొక్కజొన్న పంటలకు సరిపడ ఎరువులు జిల్లాలో ఉన్నాయని, ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఆర్బీకేల్లో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ కె.వెంకట్రావు, మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌సాగర్, ఏఈఓ మోహన్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మిమోసపోవద్దు

బాపట్ల: ధాన్యం రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. బుధవారం స్థానిక కోన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. సివిల్ సప్లయ్ అధికారుల సూచనల మేరకు ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవటం వలన మద్దతు ధర లభిస్తుందని సూచించారు. దళారులు, కొంతమంది రైస్‌మిల్లర్స్ ఆగడాలను అరికట్టేందుకు ఆర్బీకేలు పని చేస్తాయని చెప్పారు. కొంతమంది రైతులు తమ ధాన్యం రేపల్లె, వేమూరు ప్రాంతాలకు చెందిన రైస్‌మిల్లులకు కేటాయించటం వలన ఇబ్బందులు పడుతున్నామని చెప్పారన్నారు. బాడుగ, మద్దతు ధరను ప్రభుత్వం ఇస్తునప్పడు నేరుగా మిల్లులు వద్దకు తీసుకుని ధాన్యం విక్రయించుకోవటంలో ఎందుకు ఇబ్బంది పడుతున్నారో అర్థం కావటంలేదన్నారు. రైతుభరోసా ఏర్పాటును ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. రైతులు లబ్ధిపొందాలనే అంతిమ లక్ష్యంగా ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.ఆర్బీకేలు తేమ శాతం నిర్ణయిస్తే రైస్‌మిల్లర్స్ తేమశాతం పెంచుతున్నారని చెప్పటం సరికాదని చెప్పారు. రైతుపక్షపాత ప్రభుత్వంలో రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ధాన్యం విక్రయాలపై వెంటనే బిల్లులు కూడా జమ జరుగుతున్నాయని చెప్పారు. కొంతమంది దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాశరరావు, జోగి రాజా, మండే విజయకుమార్ ఉన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలి



విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న సీడ్‌బాడ్ డైరక్టర్ జోత్స్న

చెరుకుపల్లి: మొక్కలు పెంచటం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని విశ్రాంత ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి రాధాకృష్ణ విద్యార్థులకు తెలిపారు. మండలంలోని గూడవల్లి వనజాచంద్రా పాఠశాల విద్యార్థులకు నాయుడమ్మ స్మారక విద్యా గ్రామీణాభివృద్ధి సంస్థ మరియు సీడ్‌బాడ్‌ల సయుక్త ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వివిధ మొక్కలు, రెండు కిలోల ఎరువును పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వారు పెంచే మొక్కల పట్ల కొంత సమయం కేటాయించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ కొడాలి మోహన్, కరెస్పాండెంట్ డాక్టర్ కె.రజనీకాంత్, సీడ్‌బాడ్ అసోసియేషన్ డైరక్టర్ కె.జోత్స్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.